క్లుప్తంగా

లక్ష తులసి పూజ



కొంతేరులో నిర్వహించిన లక్ష తులసి పూజ

యలమంచిలి: వైశాఖ శుద్ధ చతుర్థి నరసింహ జయంతి సందర్భంగా గురువారం కొంతేరు గ్రామంలోని శ్రీకుంతీ లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో లక్ష తులసి పూజ నిర్వహించారు. ఆలయ అర్చకులు పూలపల్లి వేణునాథ్‌ఆధ్వర్యంలో పది మంది వేద పండితులు ఈ పూజ చేశారు. ఈ సందర్భంగా భక్తులు పెద్ద సంఖ్యలో ఆలయానికి వచ్చి స్వామిని దర్శించుకున్నారు. ముందుగా కలశతో ఆలయ ప్రదక్షిణ చేసి అనంతరం తులసి పూజ చేశారు. పూజ అనంతరం భక్తులకు తీర్థప్రసాద వితరణ జరిగింది.

చురుగ్గా మంచినీటి పైప్‌లైన్ నిర్మాణ పనులు



మల్లవరంలంకలో పైప్‌లైన్ పనులను పరిశీలిస్తున్న సర్పంచ్ సుజాత

నరసాపురం రూరల్: నరసాపురం మండలం మల్లవరం పెదలంక గ్రామంలో సాగు నీటి కష్టాలు తీరనున్నాయి. ఈ గ్రామంలో మంచినీటి సమస్య పరిష్కారానికి, రెండుపూటలా సమృద్ధిగా మంచి నీరు అందించేందుకు స్థానిక ఎమ్మెల్యే, ప్రభుత్వ చీఫ్ విప్ ముదునూరి ప్రసాదరాజు జలజీవన్ మిషన్ నిధులు రూ.30 కోట్లు మంజూరు చేయిచారు. దీంతో గ్రామంలో పైప్ లైన్ పనులు చురుగ్గా సాగుతున్నాయి. ఈ పనులను గురువారం గ్రామ సర్పంచ్ గొట్టుముక్కల సుజాత, ఉప సర్పంచ్ యేలూరి కృషాజీ పర్యవేక్షించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తమ గ్రామంలో ఈ పనులు పూర్తయినట్లయితే సుమారు 300 కుటుంబాలకు సమృద్ధిగా మంచినీరు అందుతుందన్నారు. సుమారు 2500 మీటర్ల మేర పైప్‌లైన్ పనులు వేగంగా జరుగుతున్నాయి.

చిన్నారులకు బైబిల్ శిక్షణా తరగతులు



యాళ్లవానిగరువులో చిన్నారులకు బైబిల్ శిక్షణా తరగతులు నిర్వహిస్తున్న దృశ్యం

పాలకొల్లు అర్బన్: బైబిల్‌లోని విషయాలపై బాల్య దశ నుంచి అవగాహన కల్పించాల్సిన అవసరం ఉందని పాస్టర్ జాన్ సామ్యూల్ అన్నారు. యాళ్లవానిగరువులో గల ఎల్ఈఎఫ్ చర్చిలో చిన్నారులకు నిర్వహిస్తున్న బైబిల్ శిక్షణా తరగతుల్లో గురువారం ఆయన పాల్గొని చిన్నారులకు పలు అంశాల్లో అవగాహన కల్పించారు. చిన్నతనం నుంచి ఆధ్యాత్మిక భావన అనే విత్తనాన్ని నాటితో క్రమశిక్షణ గల పౌరులుగా వారు ఎదుగుతారన్నారు. సుమారు 700 మంది చిన్నారులు ఈ శిక్షణా తరగతుల్లో పాల్గొంటున్నారు. మేరీ పెర్సిస్, జాన్సన్, యువజనులు పాల్గొన్నారు.

రేపటి నుంచి వేసవి శిక్షణా తరగతులు

పాలకొల్లు సెంట్రల్: విద్యా చైతన్య సమాఖ్య ఆధ్వర్యంలో ఉచిత వేసవి శిక్షణా తరగతులు నిర్వహించనున్నట్లు సమాఖ్య అధ్యక్షులు మెరిపే శ్రీనుబాబు గురువారం చెప్పారు. శనివారం నుంచి 15వ తేదీ వరకు స్థానిక ఎంఎంరకేఎస్ఎం హైస్కూల్‌లో ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 11 గంటల వరకు శిక్షణ తరగతులు జరుగుతాయన్నారు. ఈ శిక్షణలో భౌతిక, రసాయన, జీవశాస్త్రాలకు సంబంధించిన శిక్షణతో పాటు మెంటల్ ఎబిలిటీ, పేపర్ క్రాఫ్ట్ తదితర అంశాల్లో శిక్షణ ఇవ్వడం జరుగుతుందన్నారు. పాలకొల్లు పట్టణం, పరిసర ప్రాంతాల ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. పూర్తి వివరాల కోసం 98490 06368, 94410 73902 సెల్ నంబర్లలో సంప్రదించాలన్నారు. విద్యా చైతన్య సమాఖ్య కార్యదర్శి పోలిశెట్టి శ్రీశ్రీ, మంచెం ఉమామహేశ్వరరావు పాల్గొన్నారు.

ఒబ్బిడైన ధాన్యాన్ని విక్రయించుకోవాలి

భీమవరం అర్బన్: రెండు, మూడు రోజులో తుపాను రానుందనే వాతావరణశాఖ హెచ్చరికల నేపథ్యంలో కల్లాల్లో ధాన్యపు రాశులు, ఆరబెట్టిన ధాన్యాన్ని ఆర్‌బీకే సెంటర్లలోని ధాన్యం కొనుగోలు కేంద్రాలు ద్వారా విక్రయించుకోవాలని మండల వ్యవసాయాధికారి నిమ్మల శ్రీనివాస్ రైతులకు సూచించారు. యనమదుర్రులో గురువారం రైతులకు వర్షాలపై తీసుకోవాల్సిన జాగ్రత్తలపై పలు సలహాలు, సూచనలు చేశారు. కల్లాల్లో ఉన్న ధాన్యపు రాశులపై టార్పాలిన్‌తో వర్షపు నీరు రాకుండా కప్పెట్టాలన్నారు. రాశులు చుట్టూ అడుగు వెడల్పుతో గొయ్యి తీసి వర్షపు నీరు వెళ్లకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ధాన్యం తడిస్తే 100 లీటర్ల నీటిలో 5 కేజీలు ఉప్పును కలిపి పిచికారీ చేయాలని సూచించారు.

కాళీపట్నం వంతెనకు మోక్షం

- రూ.12 కోట్లతో వంతెన, రోడ్ల నిర్మాణం
- వేగవంతంగా పనుల నిర్వహణ



కాళీపట్నంలో నిర్మాణంలో ఉన్న వంతెన పనులు

మొగల్తూరు: నరసాపురం నియోజకవర్గంలో సమస్యలపై మంచిపట్టున్న ప్రభుత్వ చీఫ్ విప్ ముదునూరి ప్రసాదరాజు పలు అభివృద్ధి పనులను వేగవంతం చేస్తున్నారు. దీనిలో భాగంగానే కాళీపట్నం తూర్పు, పడమర గ్రామాలను కలుపుతూ కాళీపట్నం ప్రధాన కాలువపై వంతెన, రహదారుల నిర్మాణానికి చర్యలు తీసుకున్నారు. సెంట్రల్‌రోడ్ ఫండ్ నిధులు రూ.12 కోట్లు మంజూరు కావడంతో రెండు లైన్ల వంతెనతో పాటు జగన్నాథపురం వయా పాతపాడువరకు రహదారి నిర్మాణ పనులను ఇటీవల ప్రారంభించారు. గత ఏడాది రాష్ట్ర మంత్రి చెల్లుబోయిన వేణుగోపాలకృష్ణ వంతెన నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. ఇటీవల పరిపాలనా అనుమతులు రావడంతో వంతెన, రహదారి పనులు యుద్ధప్రాతిపదికన పూర్తి చేయాలని చీఫ్ విప్ ముదునూరి ఆదేశాలతో పనులను వేగవంతం చేశారు.

వంతెన, రహదారి పనులకు రూ.12 కోట్లు

కాళీపట్నం నుంచి జగన్నాథపురం వయా పాతపాడు వరకు రహదారి నిర్మాణంతో పాటు శిథిలావస్థకు చేరిన వంతెనను తొలగించి దాని స్థానంలో రెండు వరుసల వంతెనకు సెంట్రల్ రోడ్ ఫండ్ నిధులు రూ.12 కోట్లు మంజూరయ్యాయి. దీంతో దీర్ఘకాలంగా ఉన్న ఈ సమస్య పరిష్కారం కావడంతో కాళీపట్నం రెవెన్యూ గ్రామాల ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. రవాణా సౌకర్యాలు అంతంతమాత్రంగా ఉన్న ఆ రోజుల్లో ఈ వంతెనను నిర్మించారు. అయితే మారుతున్న కాలానికి అనుగుణంగా గ్రామాలు అభివృద్ధి చెందాయి, వాహనాల సంఖ్య పెరిగింది, రవాణా సౌకర్యాలు మెరుగుపడ్డా వంతెన పరిస్థితి మారలేదు. చీఫ్ విప్ ముదునూరి ప్రసాదరాజు చొరవతో వంతెనకు మోక్షం కలగనుండటంతో గ్రామస్తులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.



ప్రమాదకరంగా కాళీపట్నం వంతెన (ఫైల్)

1980వ దశకంలో వంతెన నిర్మాణం

మొగల్తూరు: సుమారు 1980వ దశకంలో ఈ వంతెనను నిర్మించారు. మండలంలోని కాళీపట్నం పడమర, పాతపాడు, కృష్ణా జిల్లా చిన్న గొల్లపాలెం, పెద్దగొల్లపాలెం గ్రామస్తులు భీమవరం లేదా నరసాపురం రావాలంటే ఈ వంతెన మీదుగా రావాల్సి ఉంది. అలాగే ఇతర గ్రామాల వాసులు ఆవలి గ్రామాలకు వెళ్లాలంటే ఈవంతెన దాటి వెళ్లాల్సిందే. నిత్యం వందలాది లారీలు, ట్రాక్టర్లు, బస్సులు, ఆటోలు, వేలాదిగా ద్విచక్ర వాహనాలు ప్రయాణిస్తుండటంతో నిత్యం రద్దీగా ఉంటుంది. జాతీయ రహదారి కాళీపట్నం మీదుగా విస్తరించడంతో ప్రయాణికుల రద్దీ భారీగా పెరిగింది.

కాళీపట్నంలో పలు అభివృద్ధి పనులు చేపట్టాం



కాళీపట్నం గ్రామంలో వంతెన, రొడ్డుతో పాటు పలు అభివృద్ధి పనులు చేపట్టాం. గ్రామంలో రూ.2.50 కోట్లతో ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పనులు ముమ్మరంగా జరుగుతున్నాయి. త్వరలో అపరిష్కృతంగా ఉన్న కాళీపట్నం భూముల సమస్యను కూడా పరిష్కరిస్తాం.

– ముదునూరి ప్రసాదరాజు, ప్రభుత్వ చీఫ్ విప్

ప్రయాణికుల ఇక్కట్లు తప్పుతాయి



నాలుగు దశాబ్దాల క్రితం నిర్మించిన వంతెన భయపెడ్తుంది. నిత్యం వేలాది వాహనాలు రాకపోకలు సాగించే వంతెనపై ప్రయాణించేందుకు వాహనదారులు భయాందోళన చెందుతున్నారు. నూతనంగా వంతెన నిర్మాణం పూర్తయితే వాహనదారుల ఇక్కట్లు తప్పుతాయి.

– దొంగ నాగముని, కాళీపట్నం సొసైటీ చైర్మన్

ఎమ్మెల్యేకు రుణపడి ఉంటాం



కాళీపట్నం వంతెన నిర్మాణానికి నిధులు మంజూరు చేయించిన చీఫ్‌విప్ ముదునూరి ప్రసాదరాజుకు రుణపడి ఉంటాం. గ్రామంలోని సమస్యలపై అవగాహన ఉన్న ఎమ్మెల్యే రహదారులు, వంతెనల నిర్మాణాలకు కృషి చేయడం అభినందనీయం.

– కవురు సుబ్రమణ్యం, వైఎస్సార్ సీపీ నాయకుడు, కాళీపట్నం

పేదలకు నిత్యావసరాల అందజేత



జిన్నూరులో పేదలకు నిత్యావసర సరుకులు పంపిణీ చేస్తున్న దృశ్యం

పోడూరు: సేవ చేయడంలో ఉండే తృప్తి వెలకట్టలేనిదని జిన్నూరు సొసైటీ చైర్మన్ డీటీడీసీ బాబు అన్నారు. జిన్నూరులో వార్షికోత్సవం సందర్భంగా గురువారం 'మనకోసం మనం' సేవాసంస్థ ఆధ్వర్యంలో రిక్షా కార్మికులకు, పారిశుద్ధ్య కార్మికులకు డీటీడీసీ బాబు, సర్పంచ్ జమ్ము బేబీ మహాలక్ష్మి చేతులమీదుగా నిత్యావసర సరుకులు అందజేశారు. ఈ సందర్భంగా డీటీడీసీ బాబు మాట్లాడుతూ కష్టకాలంలో ఉన్న పేదలకు సేవాసంస్థలు సహకారం అందించాలన్నారు. 'మనకోసం మనం' సేవా సంస్థ గత ఐదేళ్లుగా నిర్వహిస్తున్న సేవా కార్యక్రమాలను అభినందించారు. సేవా సంస్థ వ్యవస్థాపక అధ్యక్షులు పడాల పెద్దిరాజు మాట్లాడుతూ పేదలకు, కష్టాల్లో ఉన్నవారికి బాసటగా నిలవడమే తమ సేవా సంస్థ లక్ష్యమన్నారు. ప్రజల సహకారంతో తమ సేవాసంస్థ ఆధ్వర్యంలో నిరివ్రామంగా సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ పాలవలస తులసీరావు, సంస్థ సభ్యులు కలిశెట్టి కనకారావు, దాసరి సత్యనారాయణ, కలిశెట్టి లక్ష్మి, భూపతిరాజు సూర్పరాజు, గండేటి శేఖర్, రవి పాల్గొన్నారు.

ప్రధాన డ్రెయిన్లను శుభ్రం చేయండి



డ్రెయిన్‌లో పూడిక తొలగింపు పనులను పరిశీలిస్తున్న ప్రభుత్వ చీఫ్ విప్ ముదునూరి ప్రసాదరాజు

నరసాపురం: పట్టణంలోని అన్ని ప్రధాన డ్రెయిన్లను ఈ వేసవిలో శుభ్రం చేయాలని ప్రభుత్వ చీఫ్ విప్ ముదునూరి ప్రసాదరాజు అధికారులను ఆదేశించారు. పట్టణంలోని మెయిన్‌రోడ్డులో డ్రెయినేజీలో సిల్టు తొలగింపు పనులను గురువారం ముదునూరి పరిశీలించారు. కొద్దిసేపు దగ్గరుండి పనులు చేయించారు. ఈ సందర్భంగా ముదునూరి మాట్లాడుతూ డ్రెయిన్ నుంచి బయటకు తీసిన వ్యర్థాలను వెంటనే అక్కడ నుంచి తొలగించాలని సూచించారు. లేదంటే పారిశుద్ధ్య ఇబ్బందులు ఏర్పడతాయన్నారు. పట్టణంలో మిగిలిన చోట్ల కూడా డ్రెయిన్లను శుభ్రం చేయాలని, లేకపోతే వర్షాకాలంలో అధిక వర్షాలుపడి మురుగు పారక ఇబ్బందులు పడాల్సి వస్తుందని చెప్పారు.

పార్కు తనిఖీ

పట్టణంలోని కాటన్ పార్కును ప్రభుత్వ చీఫ్ విప్ ముదునూరి ప్రసాదరాజు తనిఖీ చేశారు. మున్సిపల్, అధికారులు, పార్కు సిబ్బందితో మాట్లాడారు. అభివృద్ధి చేసిన తరువాత కాటన్ పార్కుకు వచ్చేవారి సంఖ్య పెరిగిందన్నారు. పార్కుకు వచ్చే వారికి స్థానికంగా ఆహ్లాద వాతావరణం ఉండేలా చూడాలన్నారు. పర్యాటకులతో సిబ్బంది మర్యాదగా వ్యవహరించాలని చెప్పారు. పార్కును మరింత అభివృద్ధి చేసేందుకు ప్రణాళిక తయారు చేస్తున్నామని చెప్పారు. ఆయన వెంట మున్సిపల్ డీఈఆర్ రమేష్, వైఎస్సార్‌సీపీ నాయకులు సీహెచ్ చిన రెడ్డప్ప ధవేజీ, దొంగ మురళీకృష్ణ పాల్గొన్నారు.

ప్లాస్టిక్ కవర్లు అమ్మితే చర్యలు



దుకాణదారుడి నుంచి ప్లాస్టిక్ కవర్లు స్వాధీనం చేసుకుంటున్న కమిషనర్ వెంకటేశ్వరరావు

నరసాపురం: పట్టణంలో వ్యాపారులు ప్లాస్టిక్ కవర్లు విక్రయిస్తే చర్యలు తీసుకుంటామని మున్సిపల్ కమిషనర్ కె.వెంకటేశ్వరరావు హెచ్చరించారు. గురువారం కమిషనర్ రైతు బజార్‌లో దుకాణాలను తనిఖీ చేశారు. వారి నుంచి ప్లాస్టిక్ కవర్లు స్వాధీనం చేసుకుని, వ్యాపారులకు ఫైన్‌లు విధించారు. కమిషనర్ మాట్లాడుతూ వ్యాపారులు ప్లాస్టిక్ కవర్లకు ప్రత్యామ్నాయ మార్గాలు చూసుకోవాలని చెప్పారు. పర్యావరణానికి, ప్రజల ఆరోగ్యానికి హానికలిగించే ప్లాస్టిక్ విక్రయిస్తే మొదటిసారి ఫైన్‌లు విధిస్తున్నామని, రెండోసారి పట్టుబడితే షాపులు సీజ్ చేస్తామని హెచ్చరించారు. ప్రజలుకూడా ప్లాస్టిక్ కవర్లు వినయోగించకుండా సహకరించాలని కోరారు.

సీఎం భరోసాతో రైతుల్లో ఆశలు



సరిపల్లిలో ధాన్యాన్ని బస్తాల్లోకి ఎత్తుతున్న దృశ్యం



రుస్తుంబాదలో రైస్‌మిల్లు యజమానితో మాట్లాడుతున్న తహసీల్దార్ ఫాజిల్

నరసాపురం రూరల్: రైతులను అన్ని విధాలా ఆదుకుంటామని, తడిసిన, మొలకెత్తిన ధాన్యాన్ని సైతం కొనుగోలు చేయాలని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అధికారులకు ఆదేశాలివ్వడం, గురువారం వాతావరణం పొడిగా ఉండటంతో రైతులు ధాన్యాన్ని ఒబ్బిడిచేసే పనిలో నిమగ్నమయ్యారు. నరసాపురం మండలంలోని చాలా గ్రామాల్లో ఇదే పరిస్థితి కనిపించింది. మండువేసవిలో అకాల వర్షాలతో రైతులు నానా ఇబ్బందులు పడుతున్నారు. వీరి ఇబ్బందులను తొలగించాలని ప్రభుత్వం గట్టిపట్టుదలతో ఉంది. ప్రతి గింజా కొనుగోలు చేస్తామని పౌరసరఫరాల శాఖామంత్రి కారుమూరి నాగేశ్వరరావు చెప్పడం కూడా రైతులలో ధీమాను నింపింది. గోనె సంచులు కూడా అందుబాటులోకి రావడం, సాంకేతిక సమస్యలను అధిగమించడం, ప్రభుత్వం నుంచి స్పష్టమైన ఆదేశాలు రావడంతో అధికార యంత్రాంగంలో కదలిక వచ్చింది. నరసాపురం మండలంలో వారం రోజుల నుంచి వ్యవసాయశాఖ సహాయ సంచాలకురాలు డాక్టర్ ఈదా అనిల్‌కుమారి తన సిబ్బందితో గ్రామాల్లో పర్యటిస్తూ రైతులకు సూచనలు సలహాలు ఇస్తున్నారు. రైతు భరోసా కేంద్రాల ఏర్పాటు కూడా వీరి పనికి ఎంతగానో దోహదపడుతున్నాయి. ధాన్యం సేకరణలో మిల్లర్ల నుంచి ఎటువంటి ఇబ్బంది లేకుండా తహసీల్దార్ ఫాజిల్ మల్లవరం, కొప్పర్రు, రుస్తుంబాద తదితర గ్రామాల్లోని రైస్ మిల్లులను, ఆర్బీకే సెంటర్లను పర్యవేక్షిస్తూ వీఆర్వోలకు పలు సూచనలు ఇచ్చారు. రైతులు ఇబ్బందులు పడకుండా ఏమైనా సమస్యలు ఉన్నట్లయితే ఉన్నతాధికారుల దృష్టికి తీసుకురావాలన్నారు.

దూరప్రాంతాల్లో ఉన్నా పింఛను అందజేత



ఫించను అందిస్తున్న తూర్పుపాలెం వలంటీరు కదలి తులసి, గృహసారధి ఇర్రింకి శ్రీనివాస్



అమలాపురం ఆసుపత్రిలో లబ్ధిదారుడికి పింఛను అందిస్తున్న వలంటీరు నాగేంద్ర

పోడూరు: శస్త్రచికిత్స చేయించుకున్న వింతంతువు వద్దకు వెళ్లి ఫించను అందించి అంకితభావం చాటుకున్నారు తూర్పుపాలెం వలంటీరు, గృహసారధి. తూర్పుపాలెం గ్రామానికి చెందిన వితంతువు నూటికుర్తి సూర్యకుమారి ఐదు రోజుల కిందట తణుకులోని ఓ ప్రైవేటు ఆసుపత్రిలో లివర్ ఆపరేషన్ చేయించుకున్నారు. శస్త్రచికిత్స అనంతరం ఆమె తణుకులోనే కుమారుడు ఇంటి వద్ద ఉంటున్నారు. దీంతో ఈ నెల 3వ తేదీన సాయంత్రం గ్రామ వలంటీరు కదలి తులసి, గృహసారధి ఇర్రింకి శ్రీనివాస్ తణుకు వెళ్లి సూర్యకుమారికి వితంతు పింఛను సొమ్ము రూ.2,750 అందించారు. ప్రభుత్వ ఆశయాలకు అనుగుణంగా వలంటీరు, గృహసారధి అంకితభావంతో విధులు నిర్వహించడంతో పలువురు గ్రామస్తులు వారిని అభినందిస్తున్నారు.

ఆసుపత్రికి వెళ్లి పింఛను అందజేత

పెనుగొండ: వలంటీర్లు నిబద్ధతను చాటుకుంటున్నారు. పింఛను లబ్ధిదారులు సుదూర ప్రాంతాల్లో ఉన్నా వెళ్లి పింఛను సొమ్ము అందిస్తున్నారు. ఆచంట మండలం కొడమంచిలికి చెందిన పుచ్చకాయల అప్పాయమ్మ అనారోగ్యంతో అమలాపురంలోని ఆసుపత్రిలో చికిత్స పొందుతోంది. విషయం తెలుసుకున్న వలంటీరు శీలబోయిన నాగేంద్ర, అసిస్టెంట్ రాజ్‌కమల్ అమలాపురం ఆసుపత్రికి వెళ్లి అప్పాయమ్మకు పింఛను సొమ్ము అందించారు. నాగేంద్రను పలువురు అభినందించారు.

● వినువీధిలో విహారమా!



ఆకాశవీధిలో ప్రయాణించాలంటే విమానం ఎక్కాల్సిందే.. అయితే ఇక్కడ మాత్రం బైక్‌లు, కార్లు ఆకాశవీధిలో రయ్..మంటూ వెళుతున్నట్లుగా ప్రయాణికులకు అనుభూతి కలిగింది. పాలకొల్లులో ఆర్‌ఓబీపై గురువారం సాయంత్రం ఆకాశంలో తెల్లని మేఘాలు కమ్ముకోవడంతో ఈ దృశ్యం కనిపించింది.

– పోడూరు

బీసీ కాలనీలో సీసీ రోడ్డుకు శంకుస్థాపన



ఇలపర్రులో గడపగడపకూ నిధులతో అభివృద్ధి పనులకు శ్రీకారం చుడుతున్న సర్పంచ్ పద్మావతి

పెనుగొండ: సీఎం వైఎస్ జగన్ గ్రామీణ ప్రాంతాల అభివృద్ధికి కంకణం కట్టుకున్నారని మండల సర్పంచ్‌ల చాంబర్ అధ్యక్షుడు దండు పద్మావతి అన్నారు. గురువారం ఇలపర్రులో గడపగడపకు మన ప్రభుత్వంలో మాజీ మంత్రి చెరుకువాడ శ్రీరంగనాథరాజు దృష్టికి వచ్చిన సమస్యల పరిష్కారానికి శ్రీకారం చుట్టారు. ఇలపర్రు సచివాలయ పరిధిలో రూ.20 లక్షల నిధులతో బీసీ కాలనీలో సీసీ రోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. సీఎం జగన్‌కు, మాజీ మంత్రి శ్రీరంగనాథరాజులకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో ఎంపీటీసీ పడపట్ల పద్మనాగేశ్వరి, సొసైటీ చైర్మన్ వేండ్ర వెంకటేశ్వర్లు, వైఎస్సార్ సీపీ మండల ఉపాధ్యక్షుడు పులిదిండి వెంకటేశ్వరరావు, మాజీ సర్పంచ్ కేతా భీముడు, పడపట్ల మధు, గుణపాటి సంజీవరావు, కాకిలేటి బాపిరాజు, శ్రీనివాస్ పాల్గొన్నారు.

దర్శకరత్న దాసరికి కవురు నివాళి



దాసరి విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న జెడ్పీ చైర్మన్ కవురు



దాసరి విగ్రహానికి నివాళులర్పించిన నాయకులు

పాలకొల్లు అర్బన్: సినిమా ప్రపంచంలోకి దర్శకరత్న దాసరి నారాయణరావు మళ్లీ జన్మించాలని ఆశ పడుతున్నానని జెడ్పీ చైర్మన్, వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి కవురు శ్రీనివాస్ అన్నారు. దర్శకరత్న దాసరి నారాయణరావు జయంతి సందర్భంగా గురువారం పాలకొల్లు గాంధీబొమ్మల సెంటర్‌లో ఆయన నిలువెత్తు విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించి మాట్లాడారు. కేంద్ర మంత్రిగా పనిచేసిన దాసరి దేశాభివృద్ధికి ఎంతో పాటుపడ్డారన్నారు. దాసరి నారాయణరావును ఆదర్శంగా తీసుకుని కళాకారులు, రాజకీయ నాయకులు ముందుకు సాగాలన్నారు. రాష్ట్ర ఎస్సీ కమిషన్ మెంబర్ చెల్లెం ఆనందప్రకాష్, జెడ్పీటీసీ సభ్యుడు నడపన గోవిందరాజుల నాయుడు, దాసరి వెంకటేశ్వరరావు, పట్టణ పార్టీ అధ్యక్షుడు చందక సత్తిబాబు, నాయకులు అడబాల వెంకటరమణ, ఖండవల్లి వాసు, శీలం సూరిబాబు, ఇజ్జాడ చినబాబు, మోర్త గిరీష్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా దాసరి జయంతి

పాలకొల్లు సెంట్రల్: దర్శకరత్న దాసరి నారాయణరావు జయంతిని పట్టణంలో నిర్వహించారు. గురువారం స్థానిక గాంధీబొమ్మల సెంటర్ వద్ద దాసరి నారాయణరావు విగ్రహానికి వివిధ పార్టీల రాజకీయ నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. గిన్నిస్ పుటలకెక్కిన శతచిత్రాల దర్శకుడు, పట్టణంలో డీఎన్నార్ కళాశాల ఏర్పాటుకు తనవంతు కృషి చేసి విద్యార్థినులకు విద్యాదాతగా కీర్తిని పొందారని, దాసరి నారాయణరావు సేవలు ఎప్పటికీ మరువలేనివని నాయకులు కొనియాడారు. ఈ కార్యక్రమంలో చింతలపూడి నియోజకవర్గ పరిశీలకులు గుణ్ణం నాగబాబు, మాజీ ఎమ్మెల్సీ మేకా శేషుబాబు, ఎమ్మెల్యే నిమ్మల రామానాయుడు, ఎమ్మెల్సీ అంగర రామ్మోహనరావు, డాక్టర్ సీహెచ్ సత్యనారాయణమూర్తి, నటీనట సమాఖ్య సభ్యులు వంగా నరశింహరావు, యర్రంశెట్టి వెంకటరత్నం, చుండూరి రంగయ్యనాయుడు, డాక్టర్ ముచ్చర్ల సంజయ్, జక్కంపూడి కుమార్, తాళాబత్తుల వెంకటేశ్వరరావు, గుడాల హరిబాబు పాల్గొన్నారు.

డీఎన్నార్ మహిళా డిగ్రీ కళాశాలలో..

దాసరి నారాయణరావు ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల అభివృద్ధికి కృషి చేసిన మహనీయుడు దాసరి నారాయణరావు అని కళాశాల పాలకవర్గ సభ్యులు చోడిశెట్టి బారిష్టర్ అన్నారు. గురువారం దాసరి జయంతి పురస్కరించుకుని ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. లాభాపేక్ష లేకుండా సమాజాభివృద్ధి ఆకాంక్షిస్తూ శతచిత్రాలను రూపొందించిన గొప్ప వ్యక్తి అని కొనియాడారు. కళాశాల వైస్ ప్రిన్సిపాల్ రవిశంకర్, పాలకవర్గ సభ్యులు కొండ్రెడ్డి నారాయణరావు, అధ్యాపకులు తదితరులు పాల్గొన్నారు.

గ్రామాల్లో ఫ్యామిలీ ఫిజీషియన్ సేవలు



సీతారామపురం సౌత్ గ్రామంలో ఫ్యామిలీ ఫిజీషియన్ నిర్వహిస్తున్న వైద్యులు

నరసాపురం రూరల్: పేదల వైద్యం కోసం ప్రభుత్వం కోట్లాది రూపాయలు ఖర్చు చేస్తోంది. ప్రతి పేద రోగికి కార్పోరేట్ స్థాయిలో వైద్యం అందించాలనే ఉద్దేశంతో ఇప్పటికే చాలా మేరకు ఆసుపత్రులను, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలను కొన్నింటిని నిర్మించడం, మరికొన్నింటిని ఆధునికీకరణ చేసింది. అంతే కాకుండా వైద్యశాఖలో ఖాళీలలను పూర్తిస్థాయిలో భర్తీ చేసింది. మిగిలి ఉన్న ఖాళీలనుకూడా త్వరలోనే భర్తీ చేయాలని ప్రభుత్వం ఇటీవల నిర్వహించిన వైద్యశాఖ సమీక్షల్లో స్పష్టమైన ఆదేశాలు జారీ అయ్యాయి. వీటికితోడు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఫ్యామిలీ ఫిజీషియన్ కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. ప్రతిరోజు వైద్యులు ఆయా గ్రామాల్లోని హెల్త్ క్లినిక్‌లకు, రోగుల ఇళ్లకు వెళ్లి వైద్యసేవలు అందిస్తున్నారు. అవసరమైన మందులు ఇవ్వడం, వైద్యపరీక్షలు నిర్వహించడం చేస్తున్నారు. రోగికి తగు సూచనలు, సలహాలను ఇస్తూ సీఎం జగన్ ప్రభుత్వం అండగా ఉంటుందని వైద్యసిబ్బంది ధైర్యం చెబుతున్నారు. సరిపల్లి, రాజుగారి గ్రామాల్లో వేరువేరుగా ఫ్యామిలీ ఫిజీషియన్ కార్యక్రమం జరిగింది. వైద్యులు రోగులను పరీక్షించి అవసరమైనవారికి మందులను పంపిణీ చేశారు. వైద్యులు మాధురి, చిరంజీవి, సీహెచ్‌వోలు సోని, వైధుర్య సిబ్బంది మంగతాయారు, చింతపల్లి రవి, ఏఎన్ఎం, ఆశా, 104 సిబ్బంది పాల్గొన్నారు.